కథానిక:

# కాళరాత్రి

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

సెప్టెంబరు నెల చివరిరోజులు; సుమారు వారంరోజులు వర్షాలు ఎత్తిపెట్టినట్లే కనబడి, ముసురు మొదలుపెట్టింది. అంతకు ముందునాడు రాత్రి మొదలయింది, ఉదయం ఒక్క అరగంట మాత్రం తెరిపించ్చింది; అంతే, రోజంతా చినుకుతూనే ఉంది. ఈదరగాలి కొట్టూంది. వీధుల్లో కలుసుకొన్న మిత్రులు పరస్పరం "ఎక్కడో గాలివాన పెట్టినట్టుంది; దాని చివర ఇది అన్నమాటను కుశలప్రశ్నల్లో భాగంగా చేసుకొన్నారు. ఇంకా తమకు రేడియోలున్నాయన్న విషయాన్ని సున్నితంగా తెలుపుదు చేసుకోవాలన్న వారు అవునండీ, నిన్నరాత్రి వార్తల్లో ఎక్కడో సముద్రంలో సుడిగుండం ఏర్పడిందనీ, గాలివాన రావచ్చుననీ చెప్పారు. పిల్లల గొడవలో సరిగా వినడంకాలేదు" అని ముసురుకు తమకు తెలిసిన అధికమయిన కారణాన్ని ప్రసారం చేసుకోసాగారు. రోడ్లు పరిశుభ్రంగా ఉండేంత పెద్ద పట్టణం కాకపోయినా, అటూ ఇటూ తిరిగే బళ్ళకు లోటులేదు; అవి తుళ్ళించే బురదకూ లోటులేదు. ఈ వచ్చే బస్సుతో మన బట్టలు ఎందుకూ పనికిరాకుండా బురద కొట్టుకొనిపోతాయని తెలిసికూడా తప్పుకోందికి తగిన ఎడంలేనివి పెద్దవీధులు; ఇక తక్కిన సందుగొందుల సంగతి చెప్పుకోడం అనవసరం. పాదాలు పూర్తిగా కూరుకుపోయే బురద; అక్కడక్కడ చిన్న నీటికుంటలు; రోడ్డు ప్రక్కనుండే కాలవలు రోడ్డు ఒకే తీరుగా ఉన్నాయి. కాలవలు వేసవికాలంలో కళ్లకి కనబడడానికే గాని, మురుగునీరుగాని, వర్షపునీరుగాని పారిపోడానికిగాని కాదు.

పట్టణంలో చాలాభాగం ఇళ్లు, గాలీ వెలుతురూ ప్రసరించడానికి వీల్లేకుండా కట్టినవే. ఇల్లువంటి ఇల్లు ఇరికించుకొని కట్టుకోడంవల్ల ప్రక్కలకు కిటికీలుండే సావకాశంలేదు; పొడవుగా గొట్టాలలాగుండే ఇళ్లకు ముందు వెనకలకు కిటికీలున్నా లేనిలో జమే.

ఇళ్లలో అధికారం తమదే అయి, ఇంటిలో దేనికీ లోటులేని వాళ్లకు ముసురువాడు ఇంట్లో కూర్చోడమే బాగుండవచ్చును. కాని, ఇంటిలో శాంతి సౌఖ్యాలు రెండూ లేని సత్యనారాయణ వంటివాడికి, ఇంటికంటె గుడిపదిలం అన్నట్టు, వీరయ్య కాఫీ హోటలే ఇటువంటి రోజుల్లో శరణ్యం. ఈగలు ముసురుతూ ఉన్నా, పగలే చీకటికోణంగా ఉన్నా వచ్చేపోయే మనుష్యుల వైఖరీ, ప్రసంగరీతీ, టిఫిను తినేపద్ధతీ ఇవన్నీ మనలనుగూర్చి మనం ఆలోచించకుండా ఉండడానికి తగిన సాయంచేస్తాయి. ప్రస్తుతం సత్యనారాయణకి ముఖ్యంగా కావలసించే అది.

స్కూలుకి దసరా శెలవులు—కాని తనకి మరి శెలవురోజులయినా ఒకటే, బడిఉన్న రోజులయినా ఒకటే. రేపటి నుంచి దసరా శెలవులు ప్రారంభమవుతాయనగా, కొంప మునిగిపోయినట్టు పరుగెత్తుకొనివచ్చి ప్రవేశించాడు పద్మనాభంగారు—బోలెడంత శెలవుంది; ఆరోగ్యమూ అంతంత మాత్రంగా ఉంది; అయితేనేం, ఎక్కడ శెలవుల్లో పని చేయకుండా జీతంవచ్చే సావకాశం పోతుందో అని—ఇంతాచేసి, ఈ డబ్బు ఎవరికోసమని!—తానెంత ఆరోగ్యంగా ఉన్నాడో భార్యకూడా అలాగే ఉంది. ఎవరుముందో ఎవరు వెనుకో అన్నట్టు ఉన్నారు. ఇన్నాళ్ళూ, శుభ్రంగా తిండితిని, బట్ట కట్టుకోడానికి కూడా, కక్కుర్తిపడి, వడ్డీలకి వడ్డీలు పెంచి ఆర్జించిన డబ్బు కావలసినంత ఉంది. అయినా ఎందుకో ఈ తాపత్రయం? అతనేగాని ఆరోజున ఉద్యోగంలో జాయినుకాకుండా ఉండిఉంటే? తనకు ఈ ఇరవైరోజులకు ఏమాత్రమూ శ్రమలేకుండా జీతంవచ్చిఉండేది. మొన్నరాత్రి నాన్నగారితో వచ్చిన వివాదంకూడా రాకుండా ఉండేఉండేది. ధనికవర్గాల్లో తగాదాలకు కారణాలు ఏమయినా మధ్యతరగతిలోమాత్రం నూటికి తొంభయిపాళ్లు వాదోపవాదాలు, అపశ్రుతులు, రసాభాసలూ కేవలం ఆర్థికమైన మూలాధారం కలిగినవి మాత్రమే.

పోనీ ఈ సమస్యలనుమానేథోరణిలోనయినా కాస్త ఒకరి నొకరు అర్థంచేసుకొనేప్రయత్నంచేస్తే ఏమి తప్పు? తా నిప్పుడేమీ ఉద్యోగం చెయ్యననలేదే? సర్వవిధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు; నాన్నగారువెళ్లి కలుసుకోమన్న ప్రతివారినీ కలుసుకొంటూనే ఉన్నాడు. వినయవిధేయతలుట్టిపడేలాగ మాట్లాడుతునేఉన్నాడు. అయినా ఏమో తాను ఎందుకూ పనికిమాలినవాడుగానే కనిపిస్తున్నాడు నాన్నగారికి.

వారంరోజులక్రిందటివరకూ తానూ ప్రయోజకుడే. కాదూ మరి, నాన్నగారితో సమంగా జీతం తెచ్చేవాడు ప్రయోజకుడు కాక మరెవడవుతాడు. అప్పుడు నాన్నగారు తనతో మాట్లాడే ధోరణి వేరు. తమ్ముళ్లు, చెల్లెళ్ళుకూడా తనను ప్రత్యేక గౌరవంతో చూసేవారు. నిన్నను మధ్యాహ్నం భోజనం అయేక కిళ్లీలు సిగరెట్లు తెమ్మంటే తమ్ముడు వెంకటిగాడు తనకేదో పెద్దపని ఉందన్నాడు. వాడుచేసేపని ఏమీలేదు; ఇంకా ఎప్పుడో రావలసిన దీపావళికి సిసింద్రీలు కట్టడానికి గొట్టాలు తయారు చేస్తున్నాడు. అయినా వాడికి అమ్మదన్ను ఉంది. తాను ఎందుకూ పనికిరానివాడు, ఏపనీలేనివాడు, దమ్మిడీ ఆర్జనలేందీ కిళ్లీలూ సిగరెట్లు దేనికి? ఇది అమ్మసిద్ధాంతం—ఇదే ఇంట్లో తక్కిన అందరికీ పట్టుకొంది. అంతిగా అప్రయోజకుడయిన తనవంటివాడికి పెళ్ళి చెయ్యడానికి ఎందుకో ఈ తొందర? వాళ్లు వచ్చినంతమాత్రంలో

తనకి నచ్చాలని నిర్బంధంఏమిటి? అసలు ఈ నిరుద్యోగస్థితిలో పెళ్లి చేసుకొంటే, ప్రస్తుతం ఉన్న సమస్యలు రెండింతలుగానే కాదు, పదింతలుగా పెరుగుతాయి—ఇప్పుడు తనమీదఎవరికి ఎంత అయిష్టంగాఉన్నా తనుగట్టిగా ఏమైనా అనడానికి జంకుతారు. ఎంత చేతకానివాడయినా, తాను, అంతగా చికాకువస్తే ఎక్కడికయినా పారిపోగలడు; ఏదో విధంగా బ్రతకగలడు. చివరికి అదే తప్పనిసరి అవుతుందేమో? తాను తొందరపడ్డాడనకుండా, వీలున్నంతవరకూ సహించిచూస్తాడు. మరి ఇంట్లో పరిస్థితులు ఎప్పుడు దుర్భరమనిపించి, స్థానికంగా ఉద్యోగం వచ్చే ఆశ శూన్యమయినప్పుడు, ఎవ్వరికీ చెప్పకుండా ఎక్కడికో ఒకచోటికి పారిపోతాడు. అంతవరకూ ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా ఉండానికే ప్రయత్నిస్తాడు. ఇది నాటి సాయంత్రం అంతా కాఫీ హోటల్లో కూర్చొని, ఆలోచించి, సత్యనారాయణ చేసుకొన్న నిశ్చయం.

ఆఫీసు పేరుకి అయిదు గంటలతో అయిపోయినా, నాన్నగారు ఇంటికి వచ్చేసరికి ఏడు దాటుతుంది. ఆయన వచ్చేవరకూ ఉంటే ఆయన భోజనానికి లేచేవరకూ ఆగాలి; అంటే ఎనిమిది దాటుతుంది. అదొక పెద్ద ఆలస్యం అని కాదుగాని, భోజనాల సమయంలో ఎవరో ఒకరు ఏదో ఒకమాట అనకపోరు. దానితో ప్రసంగం ఎటు తిరుగుతుందో చెప్పలేము. అప్రయోజకుడయిన పెద్ద కొడుకుగా మధ్యతరగతి సంసారంలో పుట్టడంకంటె పెద్ద నేరం ఏమీ ఉండదు. వాడు ఏమి చేసినా తప్పే, చేయకపోయినా తప్పే—

తను కాలేజీకి బి. యే.లో వచ్చిన అయిదు సెకెండు క్లాసుల లోనూ తన దొకటి. వాళ్ళంతా హాయిగా పై చదువులు చదువుకొంటున్నారు. తనకి ఆ అవకాశం లేకపోవడమూ తన పొరపాటేనా? చదువుకి సావకాశం లేకపోయినందుకు తాను పెద్దగా విచారించలేదు. తనకంటె తెలివితేటలుగల సుబ్రహ్మణ్యం, నాగరాజు, రామచంద్రరావు, లక్ష్మణశాస్త్రి వీళ్ళంతా స్కూలు ఫయినలుతోనూ ఇంటర్మీడియేటుతోనూ చదువుకి స్వస్తి చెప్పవలసిన వారయారు—ఈ ఊళ్లోనే కాలేజీ లేకపోతే, తనూ స్కూలు ఫయినలుతోనే చదువు సాంతం చేసిఉండును. అయినా ఇప్పుడీ బియ్యే కూడా ఉద్యోగాన్వేషణదృష్ట్యా తన కేమీ ఉపయోగించేదిగాలేదు. ఏమో, ముందు ముందు ఉపయోగిస్తుందేమో? ఎందుకు పనికివచ్చినా, పనికిరాకపోయినా ఇంగ్లీషు సారస్వత సముద్రాన్ని మథించే సావకాశాన్ని మాత్రం ప్రసాదించి—పుస్తకాలు స్వంతానికి కొనుక్కొనే శక్తి లేదు తనకి—బహుశః ఎన్నటికీ లభించదేమో! అయినా ఉచితంగా పుస్తకాలు చదువుకోనిచ్చే లైబ్రరీలన్నవి ఉంటున్నంతకాలం, రోజుకి కొన్ని గంటలయినా చదువుకొందికి తనకి వీలున్నంతకాలం—తన జీవితంలోని లోటుపాట్లు ఎలా ఉన్నా సరే, వాటి ప్రసక్తి తనకి లేదు—పరిణత ప్రజ్ఞులు, లోక సంగ్రహపరులు అయిన ఎందరో మహామేధావుల దృక్కోణాలనుండి ప్రపంచాన్ని తాను చూడగలడు—తన కీ దేశంలోని కలకత్తా, బొంబాయి, మద్రాసు, ఢిల్లీ నగరాలకంటె, డికెన్సుమూలంగా లండను, ఓ హెన్రీ మూలంగా న్యూయార్కు, మపాసామూలంగా పారిసూ సుపరిచితములు—మనలోని లోటుపాట్లు డాక్టర్లకి తప్ప, మనకు సామాన్యంగా తెలియనట్టే, మన ఆకారాన్ని చిత్రలేఖకుడు చూసిన ప్రత్యేక దృష్టితో మనం చూసుకోలేనట్టే, ప్రజలు తమనుగురించీ, తమ పరిసరాలను గురించీ స్పష్టంగా తెలిసికోలేరు. బానిసలుగా బ్రతుకుతున్న వారికీ, పరపరిపాలనకు దాసోహమనేవారికీ అందులో పెద్ద పొరపాటు కనిపించదు. ఎవరో కొందరు, తాత్కాలిక పరిస్థితులకు అతీతంగా ఆలోచించగలిగి, వర్తమానంలో మిక్కిలి అసంతృప్తి చెందినవారే, భవిష్యత్తుకి మేలుబాటలు వేయగలరు.

ఇప్పుడు తీరుబాటుగా కూర్చొని తర్కించుకొంటే ఇన్ని ఆలోచనలు వచ్చాయిగాని, నిజంగా మంచి పుస్తకం పట్టుకొంటే తా నింకొక, లోకంలోనికే వెళ్లిపోలగడు. వేరే లోకమే మరి—అక్కడి మనుష్యులే వేరు, వాళ్ళ మాట్లాడేతీరే వేరు—అంతేకాదు, ఒక కొద్ది గంటలకాలంలో, ఎన్నో రోజులూ, నెలలూ సంవత్సరాలూ తరతరాలు గడిచిపోతాయి—ఇంత గొప్ప ఆనందం ఇంత సులభంగా ఖర్చులేకుండా దొరుకుతూఉంటే ప్రజలెందుకో కాలం గడవక, అస్తమానం ఆవులించుకొంటూ, 'మరేమిటి విశేషాలు?' అనుకొంటూ, అదివరకు వందసార్లు చెప్పుకొన్న సంగతులనే మళ్లీమళ్లీ అదే మొదటిసారన్నట్టుగా చెప్పుకొని కాలాన్ని బరువుగా నెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటారు—లేదా అనుమానంమీద, లక్షలో ఒక వంతు అవకాశంమీద ఆధారపడిన జూదం, లాటరీ పజిల్సు పోటీలలో తన్మయత్వం పొందటానికి ప్రయత్నిస్తారు. పోటీలలో నికరంగా వచ్చే లాభం అవి నిర్వహించేవారికేఅని తెలుస్తూఉన్నా, ఏమో అకస్మాత్తుగా వేలూ లక్షలూ రాకూడదా అన్న ఆశతో ఎంతటి నష్టాలకు నానకష్టాలకూ అయినా భరిస్తారు—ఎన్నిమార్లు ఆశాభంగం చెందినా, ఏమో ఈమారు అదృష్టం మనల్ని వరించకూడదా అని భ్రాంతిపడుతూఉంటారు...ఇప్పుడు రాత్రి తాను దీపం పెట్టుకొని చదువుకోడంకూడా ఒక పెద్ద దుర్వ్యయంలాగే ఇంటందరికీ కనిపిస్తోంది. ప్రతి అయిదునిమిషాలకీ, ఎవరికోఒకరికి ఎందుకోఒకందుకు తనదగ్గరఉన్న దీపమే అవసరం పడుతూఉంటుంది. తరవాత మళ్లీ తెచ్చి ఇవ్వడంకూడా మరిచిపోతూ ఉంటారు.—అవును మరి, తనదేమీ పరీక్షలకి పనికివచ్చే చదువుకాదు; తన ఈ చదువువలన ఎవరికీ ఏమీ లాభించేదిలేదు; మరెందు కనవసరంగా దమురు ఖర్చు? ఇదంతా చూస్తే తాను ఈమధ్యనంతా సాయంకాలం వేగంగా, అంటే నాన్నగారు ఇంటికి రాకుండానే, చిన్నపిల్లలతోపాటు భోంచేసి, పుస్తకం పట్టుకొని బయలుదేరి, వీరియ్య హోటల్లో కూర్చుంటున్నాడు. సినిమా చూసి వచ్చేవాళ్ల సదుపాయంకోసమని హోటలు రాత్రి పదిన్నరవరకూ తెరిచేఉంటుంది. పోయి పుస్తకం పట్టుకుని కూర్చుంటే చదువుకొన్నంతసేపు చదువుకోవచ్చును. లేదా హోటలుకి వచ్చేపోయే వారి వైఖరులను గమనిస్తూ కూర్చోవచ్చును. కుటుంబ రాజకీయాలకంటె, తాను తప్ప తక్కిన అందరూ అవినీతిపరులని ధ్వనించే ఉపన్యాసాలకంటె—అదే, ఇంటివాతావరణంకంటె ఏదయినా నయం. ఆరోజు సాయంత్రంనుంచి బేరం ఏమీ సాగడంలేదు.

వీరయ్య కొంటరుదగ్గర కునికిపాట్లు పడుతున్నాడు. తానీ మూలను పుస్తకంతో తంటాలు పడుతున్నాడు. ఇవాళ ఎంచేతో చదువు సరిగా సాగకుండా వుంది. చదవడానికి కొత్త పుస్తకం ఏదీ దొరకక, అదివరకెన్నో మార్లు చదివినదే శామ్యూయల్ బట్లర్ రాసిన ది వే ఆఫ్ ఆల్ ఫ్లెష్ (*The way of all flesh*) పట్టుకొని బయలుదేరేడు. ఎక్కడయినా తీసి చదవబోతే, పుస్తకంగురించి కంటె తనను, తన పరిస్థితులనుగురించిన ఆలోచనలే ఎక్కువగా వస్తున్నాయి. పుస్తకంలోని హీరో ఎర్నెస్టు పరిస్థితి, తనస్థితి ఒక్కలాగు కనిపిస్తూంది. అయితే తనకింకా ఇంటిని విడిచిపెట్టి పారిపోయే నిబ్బరం కలగడం లేదు—

సాయంకాలం అంతా బేరం సాగకపోయినందుకు విచారం లేకుండా సినీమా మొదటి ఆట విడిచిపెట్టగానే చాలామంది భోజనానికి, టిఫినుకి వచ్చారు. అంతసేపూ ఈరోజు చేసిన పదార్థాల వల్ల వచ్చే నష్టం ఎంత, ఏవిధంగా భర్తీ చెయ్యబడుతుంది అని ఆలోచిస్తున్న వీరయ్యకి ఇప్పుడు వచ్చిన ఇందరికీ కావలసినవి ఎలా సరఫరా చెయ్యడం అనే సంతోషకరమయిన సమస్య పట్టుకొంది.

సత్యనారాయణకి మరి కూర్చుండికి బుద్ధి పుట్టలేదు—కాక, ఒక తిండి తినే మనిషి, జాగాను తానెందుకు వృధగా ఆక్రమించుకోవాలి? వీరయ్య ఏమీ అనడు, అనుకోడు, కాని, తనమట్టుకు తానే ఇంతటి గొడవను భరించలేడు. అంతేకాదు, బైట వర్షం కూడా బాగా వెలిసిపోయింది. అక్కడక్కడ నక్షత్రాలు కూడా కనిపిస్తున్నాయి. ఇంకా వర్షాకాలం ప్రభావం కనిపిస్తూనే ఉంది, చిన్న చలి కూడా ప్రారంభమయింది. ఇంకా పదీ పదిన్నర కంటె ఎక్కువ కాలేదు, ఇప్పటినుండి ఇంటికి వెళ్లి ఏం చెయ్యడం? నిద్ర ఎలాగూ పట్టదు, అంతకంటె, అలా దేవాలయం అరుగుమీద కూర్చుంటే, ఎదురుగా కోనేటిలో ప్రతిఫలించే దీపాల వెలుగును చూస్తూ ఎంతసేపయినా గడపవచ్చును. ఏ పన్నెండు ఒంటిగంటల ప్రాంతంలోనో ఇంటికి వెళ్లి, చప్పుడు కాకుండా వీధికొట్టు తలుపు తీసుకొని పడుక్కోవచ్చును — ఇంట్లో వాళ్లు సినీమాకి వెళ్లేడనుకొంటే అనుకోనీ—

వీధిచివరదాకా వెళ్లేక జ్ఞాపకం వచ్చింది, అప్పుడు తాను కాలుస్తున్నదే ఆఖరిసిగరెట్టని—మళ్ళీ, తిరిగివచ్చి, రెండు మిఠా కిళ్లీలు, ఒక అరపేకెట్టు సిజరుసిగరెట్లు తీసుకొని నడక సాగించాడు ఖరదని తిట్టుకొంటూ—

దేవాలయప్రాంతం అంతా నిర్మానుష్యంగా ఉంది. ఒక మూలను దుర్బలంగా ఒకకుక్క పడుక్కొని ఉంది; అది లేచి, చెవులు తాటించి, ఎక్కడికో వెళ్లాలన్నట్టుగా కొంచెం మేర వెళ్లి, అంతలోనే తిరిగివచ్చి ఎప్పటిస్థానంలోనే ముడుచుకొని పడుక్కొంది. పగలంతా దానికి ఏమయినా తినడానికి దొరికిందో లేదో? దీనిమాటే ఏమిటి? ఇంతకన్నా నికృష్టంగా చూడబడుతూ, దీనంగా అడుక్కోడంతప్ప, ఆహారసేకరణకు అన్యమార్గం తెలియని వేనకువేలు బిచ్చగాళ్లున్నారు. వాళ్ళను చూడడానికికూడా అసహ్యం—అంతేగాని వాళ్లకు ఆస్థితి పట్టకుండా ఉండే ఉపాయం ఆలోచించేవారు లేరు—తనకు డబ్బు ఆర్జించే శక్తి లేకపోలేదు. మొన్న మొన్నటివరకూ ఆర్జిస్తూనే ఉన్నాడు. ఇంక, మళ్ళీ ఏక్షణాన్నయినా ఉద్యోగస్థుడు కాగలడు—ఆ సంగతి తనకే కాదు; ఇంట్లోవాళ్ళకికూడా బాగానే తెలుసును. అయినా తన యీ తాత్కాలికనిరుద్యోగస్థితి ఇంత దుర్భరంగా, అవమానజనకంగా ఉంటూంటే, శాశ్వతంగా నిరుద్యోగులయి ఇతరుల ఆదరాభిమానాలమీద ఆధారపడినవారిమాట ఏమిటి? అటువంటి బ్రతుకు బ్రతికేకంటె, కొద్దిక్షణాలబాధకు ఓర్చుకొని, ఈ చెరువువంటి చెరువులోపడి ప్రాణం పోగొట్టుకోడం చాలా నయం.

అప్పుడు తను నాలుగవఫారం చదువుతున్నప్పుడు—ఒకనాడు ఉదయం లేచేసరికల్లా ఊళ్ళో పెద్దగొడవ—దేవాలయం చెరువులో ఎవరిదో శవం తేలుతున్నాదని. పెద్దవాళ్ళకి తెలియకుండా తానూ నరసింహం వెళ్ళి చూసేరు. బుర్ర, వీపు కొద్దిగా కనిపిస్తూ ఏటవాలుగా తేలుతూ ఉంది. మధ్యాహ్నం రెండుగంటలకి పోలీసులు వచ్చేవరకూ అలాగే తేలుతూ ఉంది. అంతతోనయినా పూర్తి కాలేదు. హాస్పిటలుకి తీసుకొని వెళ్ళి కోసి చూశారట—ఆ తరవాత చాలాకాలంవరకు రాత్రి పడుకోనేముందు, ఆనాటిశవం జ్ఞాపకం వస్తూ ఉండేది. హాస్పిటల్లో ఎల్లా కోశారో, ఏమిటో, అందువల్ల వాళ్లకు ఏమిటి తెలిసిందో? అమ్మమ్మ బలవంతపుచావు చచ్చినవాళ్లు దెయ్యాలవుతారంటూండేది. అమ్మమ్మమాటలను ఆధారంలేనివని కొట్టిపారెయ్యడం తేలికే. కాని, అమ్మమ్మకు సాధారములో, నిరాధారములో ఏవో కొన్ని నమ్మకాలంటూ ఉండేవి. నేడు తనకు ఏ నమ్మకాలూ నిశ్చయాలూ లేవు—అన్నీ సంశయాలే—దయ్యాలూ భూతాలూ ఊహాకల్పితాలు—సరే—అయితే, మృతి అనంతరం మానవుడేమి అవుతున్నట్టు? పూర్తిగా నశించి పోతున్నాడా? ఎప్పటికప్పుడు కొత్తగా సృష్టి జరుగుతూందా? లేక, పూర్వజన్మం పుణ్యపాపాలు ప్రస్తుత జీవితక్రమాన్ని సరిదిద్దుతాయా? స్వర్గనరకములనేవి లేవనుకోడం సులువే—కాని, మనిషి మంచితనానికి తగిన ప్రతిఫలమూ, చెడునడతకు తగిన శిక్షా లేదనుకోడం మరీ మానసికమయిన అరాజకానికి దారితీస్తుందేమో?

తీరా దుకాణానికి వెళ్ళికూడా అగ్గిపెట్టె తీసుకోడం మరిచిపోయాడు—ఇప్పుడీ సిగరెట్టు పారేస్తే మరి ఇక్కడెక్కడా అగ్గి దొరకదు—అందుచేత ఒకదానికొకటి అంటించి కాల్చేస్తే అయిదూ సుమారు ఒకగంట వస్తాయి. తరువాత పోయి పడుక్కోవచ్చును—

ఎలక్ట్రిక దీపాలుకూడా అట్టే కాంతిలేకుండానే వెలుగుతున్నాయి. గత సంవత్సరం సెప్టెంబరు నెలలోనే, తానూ సుశీల ఒక నిశ్చయానికి వచ్చేరు. తాము తమ ఉభయుల తల్లిదండ్రులనూ వ్యతిరేకించి పారిపోయి పెళ్లిచేసుకొన్నా నిజంగా సుఖపడే సావకాశం తక్కువనీ, అందుచేత ఆమె వాళ్లనాన్నగారు తీసుకొనివచ్చిన సంబంధానికి అంగీకరించడమే యుక్తమని—సుశీల తననెంతో తెలివయినవాడని నమ్ముకుంది. నువ్విలా బాగుంటుందంటే అలాగే కాని అంది—అటువంటి సరళ స్వభావంగల మనిషి ఎక్క-

తనయినా సుఖపడగలడు—తన చుట్టూ ఉన్నవారిని సుఖపెట్టగలడు—అటువంటి సుశీలను తాను చేజేతులా విడిచిపెట్టుకొన్నాడు. ఎందుకు? ఎందుకో తనకే తెలియదు, పెద్దవాళ్లను తృప్తిపరచడానికా అంటే, ఇప్పుడుమాత్రం తృప్తిపరచ గలుగుతున్నాడా? లేదే—ఉద్యోగం దొరకకపోతే అది తన నేరమే, వాళ్ళకి నచ్చిన సంబంధం, అంటే బాగా కట్నంవచ్చే సంబంధం, తనకి నచ్చలేదంటే తాను కుటుంబ శ్రేయస్సుగాని,కులగౌరవంగాని తెలియని మూర్ఖుడే—తీరా వాళ్ళ ఇష్టప్రకారం చేసుకొన్నా, తరవాత మళ్లీ సమస్యలు రావని పోనీ ఏముంది?

వస్తాయి తప్పకుండా వస్తాయి; అప్పుడు తన జీవితం ఇంతకంటె కూడా నిశ్చేష్టంగా ఉంటుంది—ఇదంతా తెలుస్తూనే తా నిందుకు తల ఒగ్గుతున్నాడు. తనకి దేనికీ తగిన ధైర్యంలేదు—ఆనాడు సుశీల సూచించిన ప్రకారం తామిద్దరూ పారిపోయి ఉంటే! ఏమో, ఎలా ఉండునో, ఆమాత్రం తమ కాలక్షేపానికి తగినపాటి ఉద్యోగం సంపాదించలేక పోవునా? ఎందుకు దొరకదూ? తాను తెలివితక్కువగా అర్థంలేని భయాలతో సుశీలను పోగొట్టుకొన్నాడంతే—కట్నాలూ ఇతర లాంఛనాలే ప్రధానంగా నిర్ణయించుకోబడే, అమ్మా నాన్నా నిశ్చయించిన సంబంధపు వధువు ఎటువంటి దవుతుందో—ఆర్థికమయిన అసౌకర్యాలతో తోడు సంసారంలో అతకని అపశ్రుతుల మనస్తత్వాలయితే ఇక చెప్పేదేముంది?

ఆనాడు తాను ధైర్యంచేసి సుశీలను తీసుకొని పారిపోయి వుట్లయితే...ఎందుకు పదేపదే గతాల సేతుబంధనం?...అయినా ఏమో మనస్సు మళ్ళీమళ్ళీ అటే తిరుగుతోంది.

చివరి సిగరెట్టు ముట్టించి లేచాడు—. లేచాడు—కాని, వెంటనే నడవాలనిపించలేదు—మళ్లీ కూర్చున్నాడు. సిగరెట్టు పూర్తయేకనే లేచిపోవచ్చునని.

సిగరెట్టు పూర్తయింది. కాని, లేచిపోవాలనే తలపు ఇందాక ఉన్నంత బలంగా ఇప్పుడులేదు. టైము పన్నెండుదగ్గర కావస్తోంది. బాగుంది. మరి కొంచెంసేపు ఇలాగే కూర్చొని పన్నెండు కొడుతూఉండగా బయలుదేరితే...ఓ, పన్నెండుకి వెళ్లి పడుకొంటే అయిదుగంటలకే లేచినా, నిద్ర సరిపడకపోదు. ఉదయం వేగం తెమిలి ఏడుగంటలకల్లా లైబ్రరీకి చేరుకొంటే మధ్యాహ్నం పన్నెండుదాకా మరే బాధా ఉండదు. ఇంకా పన్నెండు కావడానికి ఎంత వ్యవధి ఉందో?

* * * *

మేలుకొనేఉన్నా ఆరాత్రి పన్నెండుగంటలు కొట్టడాన్ని గమనించలేకపోయాడు సత్యనారాయణ. ఆఖరి సిగరెట్టుకూడా పూర్తయింది. అరువిచ్చేదుకాణం మూసిఉంటాడు. అన్నీ ఇక్కడ కూర్చొనే కాల్చేసేడుగాని, దారిలో నడుస్తూ కాల్చుకొందికి ఒకటి ఉంచుకొని ఉండవలసింది. ఆఁ, మరొక్కటి ఉంటేమాత్రం రక్షించేం దేమిటి ? అప్పుడు ఇంటికివెళ్లేక ఇంకొకటి కావాలనిపిస్తుంది. మరి, పన్నెండుకొట్టేదాకా కూర్చోడం ఎందుకు? ఇంటికివెళ్ళి, పక్కమీద పడుకొంటే నిద్ర పట్టినా పట్టక పోయినా మనం చెయ్యవలసినపని అంటూఉండదు. ఇక్కడ ఎంతసేపున్నా ఇంకా అపని మిగిలేఉంటుంది; అదీకాక, రేపు పగలు ఇంటిదగ్గర నిద్రపట్టే సావకాశం లభిస్తుందని పోనీ ఏమిటి?

లేచి ఒకటి రెండడుగులు వేసేడు—అంతలో అవతలిగట్టున ఎవరో మనిషి పరుగెత్తడం కనిపించింది. అసలు పరుగెత్తడం ముందు కనిపించిందో, వెనకనుండి కాంతా! కాంతా! అను! అన్న కేక ముందు వినిపించిందో తెలియదు—ఇద్దరు మనుష్యులు యాభై అరవై గజాలదూరంలో పరుగెత్తుతున్నారు. వెనక మనిషి గొంతు మగగొంతు; ముందరిమనిషి ఆడమనిషిఅయి ఉండాలి.

సత్యనారాయణ నడక దానంతటదే ఆగిపోయింది. ఇదేదో దొంగతనంవ్యవహారంలాలేదు. అయితే మరేమిటి?

నిశ్శబ్దమయిన ఆ వాతావరణంలో ముందటిమనిషి నీటిలో ప్రవేశించడం కనబడడంకంటె బాగా వినబడినట్టయింది. వెనకాతలే పరుగెత్తుకొనివచ్చిన మనిషి "కాంతా! కాంతా!" అని అరిచి, కొంచెంసేపు నిలబడి, అస్పష్టంగా ఏవో మాటలు అని నీటిలోకి దిగబడ్డాడు.

సత్యనారాయణ తాను చూసినదానికి ఒకవిధంగా అర్థం చెప్పుకోగలిగేడు.

భార్యాభర్తలో, ప్రేయసీప్రియులో, పోట్లాడుకొని ఉంటారు. ఆమె ముందు, అతను వెనకాల అయితే అతను వస్తున్నాడని ధైర్యంగా ఆమె నీటిలోకి దిగబడి ఉంటుంది. సరే అతనూ దిగేడు. కొంచెం శ్రమతో ఆమెనుతీసి, ఇంటికి తీసుకొని పోగలుగుతాడు. అతను రావడం ఆలస్యంఅయిఉంటే, ఏమయి ఉండునో? అటువంటప్పుడు ఆమె నీటిలో దిగకపోయిఉండునేమో. తీసేవాళ్లున్నప్పుడే నీటిలోపడి చస్తామనేవాళ్లకీ, విడిపించేవాళ్లున్నప్పుడే పోట్లాడుకొనేవాళ్లకీ ఉద్రేకం ఎక్కువగా ఉంటుంది.—సరే వాళ్ల బాధ ఏదో వాళ్లు పడతారు; మనదారిని మనం పోదాం అనిపించకపోలేదు సత్యనారాయణకు. కాని, కాళ్లు మాత్రం కదలలేదు. ఆలోచనతో సంబంధంలేకుండా దానంతటది పుట్టే తలపులేవో, ఇదేదో ఈ వ్యవహారం పరిష్కారంకాని, ఇంతలోమాత్రం తొందరేమిటంటుంది.

సత్యనారాయణకి అప్పటికీ పరిస్థితిలోని ప్రమాదం స్ఫురించలేదు. అబ్బ, ఇక్కడే ఇంత చల్లగా, కొరుకలిగా ఉండికదా, నీళ్లు ఎంత చల్లగా ఉన్నాయో? ఈ వ్యవహారం ఈ కాలంలో కాక, వేసవికాలంలో జరిగిఉంటే, జలక్రీడల సరదా కూడా తీరిపోయిఉండును, భార్యాభర్తలో, ప్రేయసీప్రియులో...ఎవరో ఈ జంటకి...

కొద్దిసేపటిలోనే మరి అంత తేలికగా ఆలోచించా లనిపించలేదు...ఎంతటి బాధ కాకపోతే ఆమె ఇంత సాహసం చెయ్యడానికి సిద్ధపడుతుంది. పాపం, అతడూ పశ్చాత్తప్తుడులాగేఉన్నాడు. పోతేపోనీ, ఎక్కడికి పోతుందో అని ఊరుకోకుండా వెంటనే పరుగెత్తుకొని వచ్చేడు.

ఏమిటంత ఆలస్యం చేస్తున్నాడు చెప్మా!

మాటలాడకపోయినా, నీటిలోంచి బైటికి రావడం తనకు స్పష్టంగా తెలియవలసిందే.

ఇదేమిటింత ఆలస్యం?

వ్యవహారం ఏమీ సవ్యంగా నడుస్తున్నట్టు లేదు. అట్టే ఆలస్యం అయితే తీసినా ప్రయోజనం ఉండకపోవచ్చును. అతను నీటిలో దిగేముందు ఏమిటో గొణుక్కున్నాడు. మాటలు సరిగా వినిపించలేదు. కొంప తీసి, అతనికి ఈత సరిగా రాకపోయి ఉండవచ్చును. అయితే, మరెందుకు దిగుతాడు? ఏదో ఉద్రేకంలో మనసు పట్టలేకపోయి ఉండవచ్చును. సత్యనారాయణకి పరిస్థితి లోని ప్రమాదం ఒక్కమారుగా అర్థమయినట్టయింది. తనమీద తనకే కోపం వచ్చింది.

ఊళ్లోని యువకులందరిలోకీ ఈతలో మొనగాడనిపించుకొని, తాను ఇక్కడ ఒడ్డునే ఉండి మౌనం మేషం లెక్కపెడుతూ కూర్చున్నాడు. అతను దిగితేమాత్రం; తనవంతు సాయం చెయ్యడంలో తప్పేముంది? అంతేకాదు చెరువులో అక్కడక్కడ నూతులున్నాయి. అడుగంతా బురదగా ఉంటుంది.

మరిక ఒక్క క్షణమయినా ఆలస్యం చెయ్యడానికి వీల్లేదు. తొందరగా విప్పడంలో చొక్కా ఛ్రువ చిరిగింది. చలిగాలికి ఒళ్లు గగుర్పాటు చెందింది. 'అబ్బ, ఎంత చలి' అనుకొంటూ గబగబా మెట్లు దిగివెళ్ళి నీటిలో ప్రవేశించాడు.

ఒక మనిషిని తాననుకొన్నకంటె సులభంగా బైటికి తీయగలిగేడు. అప్పటికింకా ప్రాణం ఉందో లేదో తెలియదు. రెండవ మనిషికోసం దిగేడు. గాలించేడు. అలిసిపోయాడు. ఎక్కడా జాడ కనబడడం లేదు. లోతు లేని నీళ్ళలోకి వచ్చి నిలబడ్డాడు. బైటికి చేర్చిన మనిషి సంగతి చూడడమా, ఇంకా నీటిలో వెతకడమా? తను పడిన కష్టం తక్కువే గాని, ఇంతలా అలిసిపోయాడు—ఏం చెయ్యడం? ఏం చెయ్యడం? ఏమీ తోచడంలేదు. ఎవరినయినా పిలిస్తే? ఎవరు వస్తారీ నిశిరాత్రివేళ—

లోపలనుంచి ఏదో హుషారు వస్తుంది, మరి ఆలస్యం చెయ్యడానికి వీల్లేదని—చిన్నతనంలో నేర్చుకొన్నది—నోటిలో వేళ్లు పెట్టి చెవులు గింగురుమనేట్టు వరుసగా నాలుగయిదుమార్లు ఈలేడు; వెఱ్ఱిగా పెద్ద కేక వేసేడు...మళ్లీ ఈల ఈలేడు; మళ్లీ కేక వేసేడు... ఎవరికీ వినబడినట్టులేదు, ఈదురు ప్రయత్నిస్తే దొరుకుతాడేమో! మళ్లీ లోతునీటిలోకి వెళ్ళబోతూ ఉంటే, దూరంనుండి టార్చిలైటు ఇటుతిప్పి కనిపించింది. "ఇక్కడే దేవాలయం చెరువుదగ్గరకి, తొందరగా రండి" అని కేకవేసి, ఈదుకొంటూ లోనికివెళ్లి వెతకడం ప్రారంభించాడు. అతను నీటిలోంచి తిరిగివచ్చేసరికి ఒక వలుగురు పోగయినారు. వాళ్ళు దీపాలు పట్టుకొని అలా నిలబడి చూస్తున్నారేగాని, ఎవరూ శ్వాసకల్పించే ప్రయత్నంకూడా చెయ్యలేదు. సత్యనారాయణ బాగా అలిసిపోయేడు; ఎలాగో చెప్పాడు, ఇంకా మరొక మనిషి నీటిలో ఉన్నాడు. వెతకండి" అని.

అక్కడకు వచ్చి ఏమీ చెయ్యకుండా నిలబడి చూస్తున్న మనుష్యులకంటె బుద్ధిమంతుడొకడు పరుగెత్తుకొనివెళ్లి దగ్గరలో ఉన్న డాక్టరుగారిని, వారిలో ఉన్న ఇళ్లలోని ధైర్యశాలులనూ కూడగట్టుకొని వచ్చేడు. కొంతసేపు తర్జనభర్జనలయిన మీదట ఎలాగో ముగ్గురు సాహసించేరు నీటిలోకి దిగడానికి. సత్యనారాయణ మళ్లీ లేవబోతూఉంటే డాక్టరుగారు వద్దని వారించారు...బైటికి తీయబడిన ఆడమనిషి బ్రతికే సావకాశం లేకపోలేదనీ, దగ్గర్లోనేఉన్న తమయింటికి తీసుకొనివస్తే, చికిత్స చేస్తాననీ అన్నారు. ఇక ఇద్దరు మనుష్యుల్ని ఆమెను మోసుకొని తీసుకొని వెళ్లాలని వంతులుపడుతూఉండగా, ఒక బలాఢ్యుడు నీటిలో అయితే నేనెందుకూ పనికిరానుగాని, బైట బాధలేదు. మీరు లెండి, అని, సునాయాసంగా బుజంమీదవేసుకొని, పదండి డాక్టరుగారూ అన్నాడు డాక్టరుగారు సత్యనారాయణను లేవదీసి తమతోపాటు తీసుకొని వెళ్లేరు, అక్కడ ఉన్నవాళ్ళకు, ఆ రెండవ మనిషి దొరకగానే తీసుకొనిరమ్మని.

సత్యనారాయణని డాక్టరుగారికి తెల్యసును. ఆయన పాడిబట్ట విప్పించి, మరేం గాభరా పడకుండా అక్కడ పడుకోమన్నారు. ఇద్దరికీ మరేం ప్రమాదం లేదు, అయినా మీరు చెయ్యవలసినదేదో మీరు చేసేరు. ఈపాటికి చెరువులో పదిమందయినా దిగిఉంటారు. మనిషిని కాదు, మంచి ముత్యాన్నయినా గాలించి పట్టుకొంటారు—ఈ రాత్రంతా నాకు పని ఉంటుంది. మీరిక్కడ నా పక్కమీద పడుకోండి. ఆవిడకి మరేం భయం లేదు, అతను కూడా ఎంత వేగం బైటికి తియ్యబడితే అంత మంచిది—ఉదయం లేచి వెళ్దురు గాని, నాకు మీనాన్నగారినీ మిమ్మల్నీ కూడా తెలుసును—...సరే సరే, ఎలా జరిగిందో ఏమిటో అంతా ఉదయం చెప్పుదురు గాని, పడుకోండి; నేను ఆ మనిషి విషయం చూడాలి. ఈపరికి మా నర్సు అంతా సిద్ధంచేసి ఉంటుంది...

* * * *

"ఎవరు, మీరా?"

"ఈ సమయంలో ధైర్యంగా తలుపు కొట్టుకొని మరెవరొస్తారు నేను తప్ప—"

"మంచిపని చేసేరు. రండి, లోపలికి."

"ఏమిటో మీకు నేను రావడం ఇష్టం లేనట్టుంది."

"అంటేమాత్రం మీరు మానుతారా? నేను మూడు రోజులాయి చెప్తున్నాను — ఎందు కనవసరంగా మాటపడతారు, హాయిగా ఉండండని."

"అదుగో అలా అంటేనే నాకు కష్టంగా ఉంటుంది. నా సుఖంకోసం అంటూ ఉండడం, పైగా ఇదీనా! నేను మిమ్మల్ని కోరను గనుక? నాకు ఇంట్లో పరిస్థితులు బాగుండక, నన్ను కొస్త అర్థం చేసుకోగలిగి, సరదాగా మాట్లాడగలవారని మీదగ్గరికి వస్తే, మీకూ కష్టంగా ఉంది—నేను రోజంతటిలోకీ ఎక్కువకాలం మీకు శ్రమ కలిగించడం లేదే—ఒక్క గంటో రెండు గంటలో కూర్చుండిపోతున్నాను. అయితే, ఈమాత్రము కొంచెం సేపటిలో ఎంతో మనసుకి విశ్రాంతిగా ఉన్నట్టుంటుంది.

"అయితే నాకుమాత్రం మీతో కబుర్లు చెప్పుతూ కూర్చోవడం ఇష్టంలేదంటారా?"

"అందుకు సంకోచమేమిటి? ఎల్లప్పుడూ ఒకే సంగతులు ఒకే ధోరణిగా మాట్లాడితే నా ప్రసంగం మీకు ఇష్టంలేకపోవచ్చును— అసలు నా మొగం చూడడమే మీకు విసుగ్గా ఉన్నట్టుంది."

"అదన్నమాట నా మాటలకి అర్థం. అలా అనుకొనే మాటయితే, సరే మీ యిష్టం వచ్చినప్పుడల్లా వచ్చి కూర్చోండి, ఎంతసేపయినా సరే, నా అభ్యంతరం ఏమీ లేదు; మీచేత అపార్థం చేసుకోబడి, మాటలు పడేకంటె పైవాళ్ళచేత మాటలు పడడమే తేలిక. ఈ ఊళ్లో నేనున్నంతకాలం మీరు యథేచ్ఛగా రావచ్చును. మళ్ళీ సిగరెట్లు మొదలుపెట్టేశారన్నమాట?"

"మొదలు పెట్టడానికి పూర్తిగా మానేస్తేకదూ? అయినా బాగా తగ్గించేసేను...నన్నేదో పక్కదారిలో పెట్టి మరిపించేద్దామని చూస్తున్నారు. ఈ ఊరు విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళిపోదామని?"

"ఇంత ప్రపంచం ఉంటూండగా, ఈ ఊరు విడిచిపెడితే వెళ్ళడానికి స్థలమే లేదా?"

"ప్రపంచం ఎంత పెద్దది ఉన్నా, మనం ఉండే స్థలం స్వల్పమయినదేకదూ. ఎక్కడికి వెళ్తామని, ఏమిటి చేద్దామని?"

"ఇక్కడనుంచి వెళ్లిపోవాలని మాత్రం నిశ్చయించుకొన్నాను. ఎక్కడికి వెళ్లాలి, ఏమిటి చెయ్యాలీ అన్నది ఇంకా నిశ్చయం కాలేదు. అయినా దానికేముంది? ఇక్కడుండి నేను చేస్తున్నదేమిటి గనుక. నేనుండగా ఈ ఇల్లు అద్దెకివ్వడం కుదరదు. ఇంత ఇల్లు నాకెవసరం.......అంతే కాదు, ఈ ఇల్లు అమ్మేస్తే కొంత డబ్బు వస్తుంది. అది పెట్టుకొని ఎక్కడో చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటాను."

"ఇల్లు అమ్మకుండా ఈ ఊళ్లోనే ఇంకొక చిన్న యింట్లో అద్దెకుండి, ఇది అద్దెకివ్వకూడదా?"

"దానికీ కూడదని లేదు—అయినా ఈ ఊరు విడిచి పోవాలని అనుకుంటున్నానన్నానుకదూ? ఇవాళ మీ యింటిలో పెళ్ళి చూపులు జరిగిఉండాలి; ఆ సంగతు లేమీ చెప్పారు కారు; సంబంధం కుదిరినట్టేనా? ఎక్కడయినా మగపెళ్లివారు వెళ్లి ఆడపిల్లను చూసుకొంటారు గాని, వాళ్ళే మిమ్మల్ని చూసుకొందికి రావడమా? ప్రజ్ఞంటే మీదేలెండి—ఇంతకీ ఏం జరిగింది, పండా కాయా?"

"మావాళ్లు స్థిరపడడం పండనుకొంటున్నారు. నేను స్థిరపడక పోడం పండనుకొంటున్నాను."

"అయితే మరి చెప్పక్కర్లేదు, ఇది అరగ్గొట్టేసే రన్నమాట? అంతేనా?"

"అంతే ననుకోండి, అయితే అంత సులభంగా తెమిలిందా? ఇంట్లో అందరూ క్రాసెగ్జామినేషను - నేను కొంతసేపు సమాధానాలు చెప్పిచెప్పి విసుగెత్తి కూర్చున్నాను మాట్లాడకుండా— దాంతో మా నాన్నగారు విజృంభించేరు—కొంతసేపు ఊరుకొని ఊరుకొని, నా పెళ్ళివిషయంలో నష్టమయినా కష్టమయినా అంతా నా యిష్టంమీదనే జరిగి తీరాలి తప్ప, మరొకలాగ జరగడానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పేసి లైబ్రరీకి వెళ్లిపోయేను. అదే మంచిదయినట్టుంది, రాత్రి ఇంటికి భోజనానికి వెళ్ళినప్పుడు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు—"

"సరే బాగానే ఉంది—కాని, తెలియక అడుగుతాను, పిల్ల తెల్లగా బాగానే ఉంటుందిటకదా, మీకెందుకు నచ్చలేదు"—

"ఇక్కడకు వచ్చినా ఈ క్రాసెగ్జామినేషను తప్పదన్నమాట?"

"సరదాకి ఏదో మాటడిగితే క్రాసెగ్జామినేష నంటారేమిటి? అసలు నా ప్రశ్నకి సమాధానం చెప్పండి."

"చెప్పడాని కేముంది, పిల్ల తెల్లగాకాదు, ఎర్రగా ఉంటుంది. కనుముక్కు తీరు ఏమీ బాగాలేదు. పళ్లు బైటికి కనబడకుండా మూసికొని ఉంచాలని నానా తాపత్రయం పడింది, అర్భకంగా ఉంది, నిలబడితే కాస్త గూని ఉన్నట్టుగా ఉంటుంది. వాళ్లు కొంత డబ్బిచ్చి సంగీతం చెప్పించే ఉంటారు. కాని, ఆ పాట వింటూంటే, కడుపులో తిప్పినట్టయింది."

"బాగానే ఉంది. అయితే మొత్తానికి మీకు నచ్చేపాటి అందగల అమ్మాయిలు లోకంలో ఎక్కడయినా ఉన్నారా? అధమం సినీమాతారలయినా మీకంటికి ఆనుతారా?"

"సినీమా తారలూ, అందాల తారలూ అనబడే వాళ్ళను నేను ప్రత్యక్షంగా చూడనేలేదు. వాళ్ళ అందంలో సగంభాగం మేకప్పుమేన్ ప్రసాదించినదీ, తక్కిన సగం కెమేరామేన్ సమకూర్చినదీ అంటారు. ఇంతకీ వాళ్లు ఎలా ఉంటే నేం, తెరమీద అందంగా కనబడి ప్రజల్ని ఆనందపరుస్తున్నారు. సినీమాల్లోని పెళ్లిళ్లు చావులూ నిజంకాకపోయినా సంతోషం శోకం కలిగించ గలిగినట్టుగానే, సినీతారల సౌందర్యం సహజమయినదైనా కృత్రిమయినదయినా దాని ఉద్దేశాన్ని అది నెరవేర్చుకుపోతున్నది."

"అదీసంగతి, అంటే ప్రియురాలు తారాపథంలో ఉందన్నమాట? మరి మీకు మామూలు పెళ్లికూతుళ్లు నచ్చకపోవడంలో వింతేముంది?"

"అక్కడే మీరు పొరబడుతున్నారు. నాది మరీ ఆశపోతు స్వభావంకాదు—ఇటీవల నేను ఇష్టపడడానికి అందంగా ఉండాలనికూడా కోరుకోవడంలేదు—ప్రత్యేకించి అంద వికారంగా ఉండకపోతే చాలుననుకొంటున్నాను. నేను తగ్గివచ్చే పరిక్ట్లా అదే గగనమయిపోతూంది. ఒక పిల్లకు మిడిగుడ్లు, ఇంకొకపిల్లకు మెల్ల; వేరొకపిల్లకు మూతి అంత వెడల్పుగా చప్పిడిముక్కు— ఇక నడకతీరు మాటతీరూ చెప్పనే అక్కరలేదు. అసలు నాది బుద్ధితక్కువ. సుశీలను చేజేతులా పోగొట్టుకొన్నాను. అయితే ఒకటి, దానికేం తక్కువకాలేదు. హాయిగానే బ్రతుకుతూంది. నిజంగానే అది నన్ను చేసుకొని ఉంటే, ఇప్పటి ఈ సౌఖ్యం, వైభవం, అనుభవించలేకపోయి ఉండేది—అలాగని, నేనేమో పెద్ద పుస్తకాల్లోని ప్రేమికుడులాగ ఆమెకోసం తపించిపోయి, తక్కిన వాళ్ళను కాదనడంలేదు—నాకు నచ్చిన సంబంధాలు ఒకటే రెండు

రాకపోలేరు. అవి నేను నాకు నచ్చేయన్నందుకు ఇవాళ నచ్చలేద న్నందుకు పక్షపాత్తే అక్షింతలు పడ్డాయి—ఒకటి సాంప్రదాయం మంచిదికాదట—రెండవ సంబంధం సాంప్రదాయం మంచిదేగాని, ముద్దుముచ్చట తీరదట—అంటే అర్థంమవటంలేదు, కట్నం, బాంధ వాలా ఏమీ విశేషంగా ముట్టజెప్పుకోలేరని—"

"బాగానే ఉంది.—పోనీ ఇవాళ ఖండితంగా చెప్పేసేరు కదా, ఈ అంశంలో ఇష్టం అంతా మీదేనని, ఇకముందయినా గొడవలేకుండా ప్రశాంతంగా మీ స్వప్నసుందరి తారాపథంనుండి దిగివచ్చేవరకూ నిరీక్షిస్తూ ఉండవచ్చును."

"మీ కిది అంత నవ్వులాల విషయంలాగుంది. నిజమే, ఎంతటి సహృదయులయిన వాళ్లకీ, నా పరిస్థితిలోని ఇరకాటమూ, బాధా అవగతంకావు కాబోలు"—

"క్షమించండి. ఇంతలోకే మీకు కోపం వస్తుందనుకోలేదు. పాలున్నాయి—పంచదార కలిపి ఇస్తాను. తాగేసి వెళ్ళి పడుకొంటారా?"

"పడుకోక, వెళ్లి, రాత్రంతా ఊరు గస్తు తిరుగుతా వంటారా?"

"ఏమో, నాకలే అనుమానం—మీరలా తిరగడంవల్ల నేకదా నేననే మనిషిని మళ్ళీ ఈ లోకంలో పడి, మామూలు సమస్యలూ గొడవలూ, మంచి చెడ్డలూ అన్నిటినీ ఎదుర్కోవలసి వస్తున్నాది, భవిష్యత్తు ఎలా ఉందో, ఎవరికీ తెలియదు, గాని, నేను మాత్రం ఎప్పుడు ఏ కష్టం అనుభవించవలసివచ్చినా, అందుకు మీరే కారణం అనుకొంటాను."

"తప్పకుండా అనుకోవలసిందే—మనుష్యులకు సుఖంగా ఉన్నప్పుడు అట్టి ఆలోచనే ఉండదు—దుఃఖంగా ఉన్నప్పుడే, ఎక్కడలేని ఆలోచనలూ వస్తాయి—అయితే, మీ కష్టాలన్నీ ఆ రాత్రితోనే సరి—ఇకముందు మీకు సుఖమే గాని దుఃఖంఅంటూ ఉండదు—"

"మీరు నాకు ఆ రాత్రి పునర్జన్మ ప్రసాదించినట్టే. అందువల్ల నేను సుఖంగా ఉంటే మీరు ఇదంతా మీ ప్రభావమే అని గర్వించవలసిన మాటే—గాని, నేను కష్టపడితే, దుఃఖపడితే మీ కేమి? ఇంత ప్రపంచంలో మీ రెవరో, నే నెవరో! అంతేనా? పైటికి అనరుగాని, మీకు నేనెంత వేగం ఈ ఊరు విడిచిపోతే అంత బాగున్నట్టుంది కదూ?"




ఉగాదికి
మా ఖాతాదార్లకు
మా అభినందనలు
శుభాశిస్సులు

"మీకు మనుష్యులను నొప్పించగలిగే మాటలు బాగానే వచ్చును."

"ఇందులో నొప్పించడాని కేముంది? మీరు నేను సుఖంగా ఉండాలని కోరుకొంటున్నట్టే నేనూ మీరు సుఖంగా ఉండాలని కోరుకొంటున్నాను. అయినా మీరు కొద్ది క్షణాలు, నాకేం పోయింది, అని ఊరుకొంటే చచ్చిపోయిఉండేదాన్ని నన్ను కాపాడేరు మీ ప్రాణానికికూడా తెగించి. అటువంటి మీకు నేను ప్రత్యుపకారం చెయ్యలేకపోడం అటుండగా, నా మూలంగా కష్టాలు, నష్టాలు కలగడం అంటే నా కెలాగుంటుంది? ఇందండి పాలు, సరే మన మాటల కేమిటి, రేపు కొనసాగిద్దాము—వెళ్ళి పడుకోండి; రేపు మళ్ళీ స్కూలుకి వెళ్ళవలసి ఉంటుందికదా!"

"సరే, వెళ్తున్నాను గాని, మీరూ ఇవాళ నేనా సంబంధం తిరగ్గొట్టడం తెలివితక్కువ పనే నంటారా?"

"నే నేమంటే ఏం, ఏమనుకొంటే ఏం, మీవాళ్లకి అసంతృప్తిగా ఉండడమూ, అందువల్ల మీకు మనస్సుకి శాంతి లేకపోవడం అనిగాని......"

"సరే, సరే, సరే, తెలిసింది; మరెందుకు. ఈమారు ఏదయినా సంబంధం వస్తే, కళ్లూ చెవులూ కూడా మూసుకొని, "అద్భుతంగా ఉంది; బ్రహ్మాండంగా నచ్చింది" అనేస్తాను.

"నే నేం మిమ్మల్ని అలా అనమనలేదే—ఒకవేళ మీరు విసుగుకొని అలా అంటే అందువల్ల శాశ్వతంగా ఇబ్బంది పడే దెవరు?" అయితే మీరు మరీ ఆకాశహార్మ్యాలు కట్టకుండా ఏదో ఒక నిశ్చయానికి వచ్చి, కాస్త సంసారపక్షంగా ఆలోచించాలి."

"ఇందాకా నేను చెప్పానుకాదూ, అవి గగనకుసుమాలే అయితే మరి నేను చెయ్యగలిగింది ఏమీ లేదు. మీకు బాగా నిద్ర వస్తున్నట్టుంది. నేను పోతాను."

"నా నిద్రకేం, నాకు పగలు రాత్రి ఎప్పుడూ నిద్రే—మరే పనీపాటు లేదు. మీకయితే రేపు పగలంతా పనిఉంటుంది. రాత్రి నిద్రలేకపోతే ఆరోగ్యం చెడుతుంది. వేగంవెళ్లి, వెళ్లినతరువాత మళ్లీ ఏదో పుస్తకం పట్టుకోకుండా పడుకోండి."

"అలాగే ప్రయత్నిస్తాను. కాని, పుస్తకం పట్టుకొంటే నిద్ర రాదు; కొన్ని పుస్తకాలు రెండు పేజీలు చదివేసరికల్లా నిద్ర ముంచుకొని వస్తుంది. మరి కొన్ని పుస్తకాలు పట్టుకొంటే అదివరకెంతకాలంగా నిద్రలేకపోయినా నిద్రరాదు."

"నాకు ఆశ్చర్యంగా ఉంది, మీకింత ఓపిక ఎలాఉందో? నేను రోజుకి ఇన్నిగంటలు నిద్రపోతూన్నా నా కింకా నిద్ర వచ్చేట్టే ఉంది. మీరు అసలే నిద్ర అక్కరలేదన్నట్టు మాట్లాడతారు. నిద్రలో కలలు వస్తాయని భయంకాబోలు మీకు"—

"కొందరు మేలుకొని కలలు కంటూఉంటారు. మరికొందరు నిద్రలో కలల రూపంగా మేలుకొని ఉంటారు. మొత్తానికి ఫలితం ఒకటే—అందనివాటికి అర్రులుచాపడం, అందినవాటిని అలక్ష్యం చెయ్యడం...మరి నేను వెళ్తున్నాను"—

* * * *

"చూడమ్మాయి.—నువ్వేమో చమత్కారంగా మాట్లాడే ననుకొన్నందువల్ల లాభం లేదు—ఇందువల్ల మమ్మల్ని అనవసరంగా క్షోభ పెట్టడమే తప్ప నువ్వు బాగుపడే దేమీ లేదు."

"నేను బాగుపడాలనా మీ తాపత్రయం? నే నెలాపోతే మీకేం? మీ అబ్బాయిని బాగుచేసుకోండి. నన్ను సగం ప్రాణం పోయినదాన్నే ఆ రాత్రి మీ అబ్బాయి కాపాడేరు అర్ధరాత్రి, జన సంచారం అసలే లేని సమయంలో ఆయన నన్ను కాపాడతారని నేను ముందుగా ఆలోచించుకొని నీటిలో పడలేదుకదా? నా వెనకాతల నన్ను కాపాడాలనే ఆత్రుతతో తనకు బాగా ఈత రాకపోయినా నీటిలోదిగిన మా ఆయనని ఎవ్వరూ కాపాడలేకపోయారు—భగవంతుడే ఆరాత్రి మీ అబ్బాయి రూపంలో వచ్చి నన్ను కాపాడేడు; ఇంకా నేను ఈ లోకంలో అనుభవించవలసిన కష్టాలంటూ ఉన్నాయి కాబోలు."

"కష్టాలు! నీకేం, దీపంచుట్టూ చేరిన పురుగులే చస్తాయి; దీపానికే లోటులేదు."

"మీరు నన్ను దీపమన్నా దయ్యమన్నా ఒక్కటే ఫలితం. నే నిప్పుడేం చెయ్యగలను? ఏంచెయ్యాలి? మీ రిలా పెద్ద రాయబారంలాగ నా దగ్గరకు రావలసిన అవసరం ఏముంది?"

"మళ్ళీ మొదటికివస్తే నే నేం చెప్పగలను? తెలిసో తెలియకో, మంచికో చెడ్డకో మావాడు నిన్ను ఆ లోకంనుండి ఈ లోకంలోనికి తీసుకొని వచ్చేడు. అందుకు వాడికి నువ్వుచేసే ప్రతిఫలం ఇదా? వాడు మాపిల్లల్లో పెద్దవాడు, కుటుంబానికి గౌరవా గౌరవాలు ఏమయినా వాడి మూలంగానే కలగాలి. వాడు సవ్యంగా పెళ్ళిచేసుకొని, ఒక యింటివాడయి, సక్రమంగా సంసారం నిర్వహించుకోడంకంటె మాకు కావలసిందేమిటి?"

"మీరు నమ్మండి నమ్మకపోండి—నేను ఆయనతో చెప్పేమాట ఇదే. అయితే. మీ సమస్యలు నాకెందుకుగాని, చూడండి, ఆయన కిష్టపడని సంబంధం చేసినందువల్ల మీకేం లాభం? లోగడ ఆయనకు ఇష్టపడిన ఒకటి రెండు సంబంధాలను కట్నకానుకలు, సాంప్రదాయం మొదలయిన అంశాలను మనసులో పెట్టుకొని మీరు వద్దంటే ఆయన మానుకోలేదా?"

"ఈ సంగతులన్నీ కూడా నీకు మావాడే చెప్పేడన్నమాట! అప్పుడు బాగానే ఉండేవాడు—అప్పటికింకా వాడి బుర్ర ఇప్పటిమాదిరిగా చెడిపోలేదు."

"అంటే ఆ చెడిపోడానికి కారణం నే నేకదూ"

"కారణం ఎవరయినా కావచ్చును. మనిషిలో నిబ్బరం అన్నది లేకపోయిన తరవాత చెడిపోడానికి అనేక కారణా లుంటాయి. మన బంగారం మంచిదయితే కంసాలివాడి ననడం ఎందుకు? అయితే, ఇక్కడ మావాడు మూర్ఖుడు. చెప్పిన మాట వినడు అనేకదా నీదగ్గరకు వచ్చి ఇలా ప్రాధేయపడడం?"

"పెద్దవారు, మీరు పదే పదే ప్రాధేయపడడం అంటే బాగుండదు. నే నేం చెయ్యాలి అని."

"నీవు ఈ ఊళ్లో ఉండడంవల్ల ప్రత్యేకంగా కలిసివచ్చే దేమీ లేదు. ఎక్కడ ఉన్నా ఈ ఇంటి అద్దె నెలనెలా వచ్చేలాగా ఏర్పాటంతా నేను పూచీగా చేస్తాను. ఇది నేనేదో హక్కు అధికారం అన్న దృష్టితో చెప్పలేదు. కాని, మావాడు అపకీర్తి పాలవకుండా ఉండడానికీ, లేదు, ఇప్పుడే వాడిగురించి అందరూ అన్ని విధాలుగా అనుకొంటున్నారు, ఇకముందయినా ఆ అపవాద నిజం కాదనే మార్గంలో వాడు పడతాడని ఆశ—...లేదా, మమ్మల్ని ఉసురుపెట్టి నువ్వు బావుకొనే దేమీ లేదు. నీకూ......

"ఇంతసేపూ మంచిగా మాట్లాడేరు, ఇప్పుడు బెదిరింపులకి దిగేరన్నమాట? బెదిరించి నన్ని ఊళ్లోనించి తగిలెయ్యగలమని ఆశ పెట్టుకోకండి. నా అంతట నేనే ఈ ఊరునించి వెళ్ళిపోవాలని నిశ్చయం చేసుకొని ఉన్నాను. అయినా మీ ధోరణి, ఏమీ లేనికే అనవసరంగా అపవాదులు లేవదీసే మనస్తత్వం ఇదంతా చూసి ఆ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నంతలా అనిపించింది."

"దం పేపు...."

"మరేం భయం లేదు. నేను పోతాను. కాని, ఒక్క మాట. లోకం ఎలా అనుకొన్నా మీరే ముందుగా మీ అబ్బాయినిగురించి అనవసరంగా చెడు ఊహిస్తున్నారు. ఆయనకు నాకూ మధ్య మీ రూహించిన సంబంధం ఏమీ లేదు. అటువంటిది ఉంటే ఇంత కాలం మీరంతా ఇలా రాద్ధాంత సిద్ధాంతాలు చేసేపర్యంతం ఎదురు చూస్తూ ఉందునా? ఆయన ఇక్కడికి వచ్చి ఒకగంట రెండుగంటలు కూర్చొని మాట్లాడి వెళ్తున్నారంతే. ఈ ఒక్క గంటలోనూ పదిమార్లయినా మీరు నా అందంగురించి ప్రస్తావించేరు. ఆయన ఇన్నాళ్ళలోనూ ఒక్కమారూ మాట అనలేదు."

"క్రియ జరిగిపోతున్నవాడికి మాటతో ఏంపని?"

"నిజమే నాకు తెలుసును మీరు నమ్మలేరని. మీకు అన్నిటికంటె పరమశత్రువు మీ మనస్సే—మీకు ప్రపంచాన్ని క్షుద్రమయినదీ, నీచమయినదీ అని చూడడంతోనూ, దానివలన హింసలు పడిపోతున్నా మనుకోడంలోనూ ఒక రాక్షసానందం ఉంది. నాకూ కొన్నాళ్లిలాగే ఉండేది...సరే మరెందుకిన్ని మాటలు— మీ రిలా నా దగ్గరకు వచ్చి ఈ గొడవంతా చెయ్యకుండా ఉంటే బాగుండేది...అలాగని మరేం భయపడకండి—నేను వెళ్లిపోతాను. అయితే మీరు మీ అబ్బాయిని బాగుచేద్దామనుకొనే పేరుతో అతన్ని మీకు శత్రువుగా తయారుచేసుకుంటున్నా రకారణంగా, వెళ్ళండి...

* * * *

అర్ధరాత్రి—చిమ్మచీకటి—ప్లాటుఫారంమీది దీపాలవెలుగూ రైలులోని దీపాల వెలుగూ తా మున్నామని సూచించడానికి మాత్రమే ఉపయోగిస్తుంది.

ఇంకా చాలాదూరంలో ఉండగానే రయిలు వస్తున్న కూత వినిపించింది సత్యనారాయణకు.

చిన్నతనంలో పరుగుపందేలలో పరుగెత్తినకంటె జోరుగా పరుగెత్తసాగాడు సత్యనారాయణ.

స్టేషనులో నుండి బండి బయలుదేరడానికి ముందు కొట్టబడే ఒకగంట వినిపించింది. ఒక్కక్షణం కాళ్లు స్తంభించిపోయాయి. నిరాశతో నిస్పృహతో అలా నేలకు కూలబడిపోయినంత పనయింది.

పీడకలలో అరవడానికి నోరురాని పరిస్థితిలో ఉన్న మనిషిలాగ అయినాకూడా ఎలాగో ఆఖరి ప్రయత్నం చెయ్యాలని ఒళ్లు తెలియని పరుగు ప్రారంభించాడు.

బండి బయలుదేరవలసిన గంటకూడా మ్రోగింది—ఇంజను కూసింది.

తనకంటె ముందున్న సుదూరం లక్ష్యాన్ని సమీపించలేనని తెలిసీకూడా, పరుగులోని వేగాన్ని హఠాత్తుగా తగ్గించుకోలేక పరుగెత్తే యంత్రమయాడు సత్యనారాయణ—

ఇంజను మళ్ళీ కూసింది—కాని, గార్డుగారు స్టేషనులోని ఆప్తమిత్రుడితో ఆంతరంగిక విషయం మాట్లాడుతూ నీ యిష్టం వచ్చినట్టు కుయ్యి, నేను అనుమతించందే నువ్వు కదిలేదిలేదు అనుకొని తన ప్రసంగం సాగించాడు, మరొక కొన్ని సెకనులకాలం.

కొద్ది సెకనులుకూడా ఒక్కొక్కప్పుడు కొన్ని జీవితాలను శాశ్వతంగా కలపడానికీ విడదియ్యడానికీ సమర్థమయినవి కావచ్చును.

"ఇంక మరి వచ్చేవారు వెళ్ళేవారు లేరు, ఇక్కడ నిలబడడం వృథా—పోయి ఈ టిక్కట్లు చేరీజు చేసుకోవాలనుకొంటున్న టిక్కట్టు కలక్టరు తుళ్లిపడేట్టుగా తోసుకొని ప్లాటుఫారంమీద పడ్డాడు సత్యనారాయణ—

ఏదో ఒక పెట్టె, ఎలాగోలాగు రైలందుకోడం అతని లక్ష్యం—

కాని, ఎదురుగా ఉన్న పెట్టె కాక పక్క పెట్టె గేటుదగ్గర నిలబడి కనిపిస్తూనే ఉంది ఆమె—అతనికి ఏమాత్రం తెలియనివ్వకుండా కట్టుదిట్టం చేసుకొని వెళ్లిపోతున్నా ఆమెకు ఏదో లోపలోపల చిన్న ఆశ ఉండిపోయింది కాబోలు—

అతను కనబడిన తరవాత, రైలు కదిలిపోయి, అతని కందకపోతే గొలుసు లాగి ఆపడానికి కూడా ఆమె సిద్ధమే. కాని, ఆ అవసరం కలగలేదు. గార్డుగారి విజిలూ, ఈమారు నిజంగా బయలుదేరుతున్నాననే యింజను కూతా, అతను బంతిలా ఎగిరి బండిలో పడడమూ అన్నీ ఏకకాలమందు జరిగేయి.

చాలాసేపటికి సేదదీరి మాట్లాడగలిగే స్థితికి వచ్చాక సత్యనారాయణ అన్నాడు. "అభూత కల్పనలు చేసి, అపవాదులు ప్రచారంచేసే లోకులే నాకంటె బుద్ధిమంతులు—అందుబాటులో నున్న వజ్రాన్నిగూర్చి ఆలోచించకుండా, రాళ్లకోసం వెతకపోగాను. అయితే నన్ను బాధపెట్టాలన్న వాళ్ళ మాటలే చివరికి నాకు కర్తవ్యాన్ని బోధించాయి, ధైర్యాన్నిచ్చాయి—ఏమంటారు."

"ఏమీ అనడం ఎందుకు? ఆ రోజు రాత్రి ఏ ఆశా లేకుండా నీటిలో పడినట్టే ఈ రాత్రి రయిలెక్కను—అప్పుడూ ఇప్పుడూ

కూడా మీ రిలా కాపాడడానికి పది లక్షల్లో ఒక వంతుకూడా అవకాశం ఉందని గట్టిగా అనుకోలేము—అయినా, ఎప్పుడూ సవ్యంగా నడిచే రైళ్ళు, శాఫీగా పారే నదులూ, ప్రశాంత గంభీరంగా ఉండే సముద్రము హఠాత్తుగా ఏవో ప్రమాదాలను తెచ్చి పెట్టగానే, అప్పుడప్పుడు కొన్ని మంచిపనులు కూడా జరగడానికి తగినన్ని అవకాశాలు లేకుండానే జరుగుతాయి. పోనీలెండి. జరగ వలసిందేదో జరిగింది. టిక్కట్టు కొన్నారా?

౬.

"టిక్కట్టు! ఎక్కడిది? నేనేగాని టిక్కట్టుకొనడానికి గాని, గేటుదగ్గర టిక్కట్టు కలక్టరు మాట వినిపించుకొందికిగాని ఆలస్యం చేసిఉంటే, అందువల్ల కలిగిన ఆశాభంగపు ఉద్ధృతికి తట్టుకోలేక ఇంకొక లోకానికి టిక్కట్టు కొనుక్కొని ఉండే వాణ్ణి—

"ఛీ, ఎందు కటువంటి మాటలంటారు! అంతా ఎలా జరగాలో అలాగే జరుగుతుంది—మన మేదో ఎంతో వేగంగా పారిపోతున్నా మనుకొంటున్నాము—ఆ నక్షత్రాలనుండి చూసేవాళ్లకి మన ధూమమే కనిపిస్తుందో కనిపించదో? రెండు చీకటి రాత్రులు మనల్ని ఇలా దగ్గరకు తీసుకొని వచ్చాయి—అయినే కలిసి ఉన్నంతకాలం ఒకరికొకరం భారంగా బాధగా పరిణమించకుండా ప్రయాణం చేద్దాము"—

"ఒక బండి అనంతంగా సరళ రేఖామార్గంలో నడవాలను కొంటుంది—ఏదో ఒకటి అడ్డువస్తుంది. దీనికి మళ్ళీ మరొక కోణా రేఖలో ప్రయాణం మొదలుపెడుతుంది. అలా దీనికి దీనికి ఎప్పటికో చలనశక్తి పూర్తిగా ఖర్చయి ఆగిపోతుంది—ఎప్పుడు ఏది మన మార్గంలో అడ్డుపడి దానిని మనం ఇంకే ఏ మార్గంలో ప్రయాణించవలసి వస్తుందో చెప్పలేము. అయితే ఒక దిక్కుగా వెళ్తున్నంతకాలం ప్రయాణం సుగమం కావాలనే ప్రయత్నం మాత్రం చెయ్యకుండా ఉండలేం, ఆ రాత్రి అదివరకు విడివిడిగా ఉన్న మన జీవితాల బండులను కలిపి ఒక దిక్కుగా, ఎడఎడంగా సమాంతర మార్గాల్లో నడిపించింది. మళ్లీ ఈ రాత్రి వేరు వేరు దిక్కులుగా విడిపోవలసిన దాని కలిపి నడిపిస్తుంది—"

"చాలా బాగానే ఉంది సాదృశ్యము. కాని నా కిదంతా తెలియదనుకొన్నారు కాబోలు. ఇదంతా చెప్పడంలో మీ ఉద్దేశం ఏమిటి అంటే మనం కలియడానికి మన ప్రయత్నంతో సంబంధం లేకపోయినట్టే, మనం విడిపోడానికి కూడా మన శక్తికి మించిన ప్రభావాలు పనిచేస్తాయని ముందుముందు తప్పించుకోవాలని కాబోలు—నేను, అంతగా, మానవప్రయత్నంమీద విశ్వాసం లేని మనిషిని కాను—మనం ఎన్నటికీ కలిసిఉంటాము నే నా ఆశ. అందుకు నా ప్రయత్నాలు వృధాపోవనే నా విశ్వాసం."

"విశ్వాసం, ఆశ ఉండడం మంచిదే—ఎంతటి అంధకారంలోనూ ఏదో వెలుగురేక, కనిపించకపోదు—దానిని ఆధారం చేసుకొని ముందుకు సాగిపోవాలనే ప్రయత్నిస్తాము గెలిచినా ఓడినా. తమసోమా జ్యోతిర్గమయ—

